
ప్రజాశక్తి

బుధవారం 20 మార్చి 2024

5

అల్లూరి సీతారామరాజు



## గిరిజనుడి కిడ్నాప్‌కు విఫలయత్నం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయితీ ఒంటిపుట్టు గ్రామానికి చెందిన అడప సురేష్‌కుమార్ అనే గిరిజన యువకుడి కిడ్నాప్‌కు కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు విఫలయత్నం చేశారు. వారి నుంచి తప్పించుకున్న బాధితుడు సురేష్‌కుమార్ చెప్పిన వివరాలివి.

ఒంటిపుట్టుకు చెందిన సురేష్‌కుమార్ మంగళవారం ఉదయం వంటచెరకు తెచ్చేందుకు కొండవైపు వెళుతుండగా, గ్రామానికి సమీపాన శ్మశానవాటిక వద్ద రోడ్డు పక్కనే మాటువేసిన కొంతమంది వెనుకవైపు నుంచి పట్టుకునే ప్రయత్నం చేశారని సురేష్ అంటున్నాడు. వారు ఎవరో, తనను ఎందుకు పట్టుకున్నారో తెలియని స్థితిలో వారి నుంచి తప్పించుకుని గ్రామానికి పరుగులు తీసిన సురేష్‌కుమార్, గ్రామస్తులకు విషయం చెప్పగా, వారు వచ్చి గాలింపు చర్యలు చేపట్టగా, ఒడిశావైపు వారు ఉడాయించారు. గ్రామస్తుల వద్ద ఎటువంటి వాహనం లేకపోవడంతో వారిని వెంబడించలేకపోవడంతో పారిపోయారు. గ్రామాలలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నారని, వారి కోసం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

## కోట్నాపల్లి హైవే క్వారీ నిలిపివేత

**జెడ్‌పిటిసి గంగరాజు ఫిర్యాదుకు స్పందించిన అధికారులు**



సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజుకు ఫోనులో సమాచారమిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హుకుంపేట: మండలం లోని కొట్నాపల్లి హైవే రాయి క్వారీ నిలుపుదల చేస్తూ మైనింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. ఈ మేరకు మైనింగ్ డిడితోపాటు పాడేరు ఆర్‌ఒ రాంబాబు, ఇతర అధికారుల నుంచి తనకు ఫోన్‌ద్వారా సమాచారం అందిందన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, కొట్నాపల్లి హైవే వద్ద క్వారీతో పరిసర ప్రాంతాల ప్రజలు దుమ్ముధూళితో పడుతున్న ఇబ్బందులపై విశాఖపట్నం జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశంలో ప్రస్తావించడంతోపాటు కొట్నాపల్లి హైవే క్వారీ తో ప్రజలకు జరుగుతున్న నష్టంపై స్థాయీ సంఘం చైర్మన్ వరహాసత్యవతి, జెడ్‌పి సిఇఒ పోలినాయుడులకు ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి, పాడేరు సబ్ కలెక్టర్ భావన వశిష్ట ఆదేశం మేరకు క్వారీ తాత్కాలికంగా నిలుపుదల చేశామని, మైనింగ్ డీడీ, ఇతర అధికారులు ఫోనులో తెలిపారని గంగరాజు తెలిపారు. ప్రజల పక్షాన వారి సమస్యలపై పోరాటానికి సిపిఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి, మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణరావు, కొట్నాపల్లి సిపిఎం నేతలు పాంగి కేశవరావు, మజ్జి బాలకృష్ణ, గొల్లోరి అప్పలస్వామి, పాంగి సుమన్ పాల్గొన్నారు.

# సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించండి

**● పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు**





సమావేశంలో మాట్లాడుతున్న అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రజల కోసమే నిరంతరం శ్రమిస్తున్న సిపిఎం తరపున అరుకులో పోటీచేయనున్న అభ్యర్థిని మంచి మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. మంగళవారం హుకుంపేటలో నిర్వహించిన సిపిఎం మండల నాయకుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, వారి సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థులకు ఓటేసి గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చట్టసభల్లో సిపిఎం వాణి వినిపించిన నాడే ఎన్నో ప్రజాసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఏజెన్సీలో జిఒ 3పునరుద్ధరణ, గిరిజన చట్టాలు పటిష్టఅమలుకు నోచుకోవాలంటే అది సిపిఎంతోనే సాధ్యమన్నారు.

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, గిరిజనాభివృద్ధి సిపిఎంతోనే సాధ్యమన్నారు. అనంతగిరి జెడ్‌పిటిసిగా తాను, హుకుంపేట, ముంచంగిపుట్టులలో పలువురు సిపిఎం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న వైస్ ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఇతర పార్టీల ప్రజాప్రతినిధుల కంటే ప్రజాసేవలో ఎంతో ముందంజలో ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించుకుంటే ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు సక్రమ వినియోగం, పివిటిజిలకు ఐఎపి, సిసిడిపి నిధులు, ఉద్యోగులకు కనీస వేతనాల అమలు, గిరి ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఆస్కారమంటుందన్నారు. కార్యక్రమంలో హుకుంపేట వైస్‌ఎంపిపి సూడిపల్లి కొండలరావు, జిల్లా నాయకులు సొంట్యాన హైమావతి, మండల కార్యదర్శి మెరకచింత, గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్‌లు వలసనైని లక్ష్మణరావు, సూడిపల్లి లక్ష్మీప్రమీల, మండల నాయకులు అప్పలకొండ పడాల్, రమణ మూర్తి, బాలకృష్ణ, కేశవరావు, చిట్టిబాబు, బుజ్జిబాబు, మొత్తి రాము, బాలకృష్ణ, అప్పలస్వామి, నాగేశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.



సంఘటనా స్థలంలో చితుకుర్రెడ్డి మృతదేహం

## గిరిజనుడు దారుణ హత్య

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని వేటుకూరు పంచాయితీ పందిరిమామిడికోట గ్రామంలో ఓ గిరిజనుడు దారుణ హత్యకు గురయ్యాడు. బంధువులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... పందిరిమామిడికోట గ్రామానికి సమీప అడవిలో గ్రామస్తులందరూ సోమవారం మామిడి కొత్త పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఆదే గ్రామానికి చెందిన కదల చితుకు రెడ్డి (50) కూడా పండుగలో పాల్గొన్నాడు. ఇతడు గ్రామానికి సమీపంలోని గొర్రెమెట్ట కొండ వద్ద ఉన్న తన కొండపోడు సేనుపాక వద్ద ఉంటున్నాడు. పండుగ వేడుకల్లో పాల్గొన్న అనంతరం సోమవారం రాత్రి తన ఇంటి వద్ద భోజనం చేసి సేనుపాక వద్దకు నిద్రించడానికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున బంధువులు వెళ్లి చూసేసరికి నిద్రించిన చోటే తల, మెడపై నరికేసి రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నాడు. బంధువులు ఊర్లో జనాలకు తెలపడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, సమీప బంధువులను ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతరు ఉన్నారు. హత్య గల కారణాలు తెలియాల్సి ఉంది.

**ఊరు పేరులోనే 'తడి'**


# 'గిరి'జనం గొంతెండుతోంది..!

**● తాగునీటి ఎద్దడిపై తడిగిరి వాసుల ఆందోళన**

**● ఖాళీ బిందెలతో మహిళల వినూత్న నిరసన**

ప్రజాశక్తి - హుకుంపేట: తమ ఊరుపేరులోనే 'తడి' తమ గొంతెండిపోతోందని తడిగిరి వాసులు ఆవేదన చెందుతున్నారు. పాడేరు ఐటిడిఎకు కూతవేటు దూరంలో, హుకుంపేట మండల కేంద్రానికి అత్యంత చేరువలో ఉన్నప్పటికీ, తీవ్రమైన నీటి ఎద్దడితో ఏళ్ల తరబడి తాము అవస్థలు పడుతున్నామనిఆందోళన వ్యక్తం చేశారు. నేతలు, అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా, హామీలే తప్ప అమలు చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. గత ఎన్నికల్లోనూ మాటిచ్చి, అటకెక్కించారని, ఈసారి ఓట్ల కోసం వస్తే నిలదీసి కడిగేస్తామంటూ మండిపడుతున్నారు. గొంతెండుతున్నా తమ గోడు ఎవరికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తూ, ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన చేపట్టారు.

మండలంలోని తడిగిరి పంచాయతీకేంద్రంలో తాగునీటి ఎద్దడి నివారించాలని గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. రెండేళ్ల క్రితం సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసి, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని బోరు పాయింట్ తవ్వించారని, తర్వాత మిగిలిన పనులు చేయకపోవడంతో అదినేడు దిష్టిబొమ్మలా ఉందని మండిపడుతున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయినీరు అందిస్తామన్న ప్రకటనలూ తమ గ్రామం దరిచేయడం లేదని వాపోతున్నారు. ఏటా వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం తాము పడే అవస్థలు అన్నీఇన్నీకాదని, బిందుడు నీటి కోసం మైళ్లదూరం కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని అంటున్నారు. తమ దుస్థితిని పదేపదే అధికారులు, నేతల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేదని మండిపడుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గ్రామానికి వచ్చిన నేతలకు తాగునీటి ఎద్దడి పరిష్కరించాలని కోరితే హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటైన మూడేళ్ల తర్వాత బోరు పాయింట్ తవ్వారని, తర్వాత సోలార్ యూనిట్,మోటారు అమరిక, ట్యాంకులు, పైపులైను, కుళాయిలు ఇతరత్రా పనులు చేపట్టకపోవడంతో బోరు పాయింట్ నిరుపయోగంగా ఉండగా, తాము దాహార్తితో అల్లాడుతూనే ఉన్నామని అంటున్నారు పొలాల్లోని ఊటకుంటలు, గెడ్డల్లోని కలుషితనీటికి తాగుతూ తాము కష్టాలు పడుతున్నా స్పందించే దిక్కులేదని మండిపడుతున్నారు. మాటిచ్చి, మోసపుచ్చిన నేతలు ఓట్లు అడిగేందుకు ఎలాగూ వస్తారని, వారిని నిలదీస్తామని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి తడిగిరిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ మహిళలు విజయకుమారి, బాలమ్మ, నాగమణి, గౌరమ్మ, వరాలమ్మ, ఝాన్సీరాణి తదితరులు డిమాండ్ చేస్తున్నారు.



రెండేళ్లుగా తవ్వి వదిలేసిన బోరు పాయింట్



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న తడిగిరి మహిళలు

## దొంగల హల్‌చల్‌తో గిరిజన గ్రామాల్లో భయాందోళనలు

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామాల్లో అర్ధరాత్రి సమయంలో దొంగలు సంచరిస్తూ హల్ చల్ చేస్తుండడంతో గిరిజన గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఎఒబిలోని ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా మాకవరం గ్రామంలో ఈ నెల 11న అర్ధరాత్రి సమయంలో దొంగలు ఇళ్లల్లోకి చొరబడి డబ్బులు, బంగారం అపహరించకపోవడమే కాకుండా, తమను అడ్డుకుంటే చంపుతామని గిరిజనులను బెదిరించినట్లు తెలిసింది. దీనిపై ఒరిస్సా పోలీసులకు సమాచారం అందడంతో ప్రత్యేక దృష్టి సారించి రాత్రి సమయంలో దొంగలపై నిఘా పెట్టినట్లు సమాచారం. అలాగే కొద్ది రోజుల క్రితం సీలేరులోని మూడో క్రాస్ రోడ్‌లో నివాసముంటున్న కాంట్రాక్టు నరసింహమూర్తి ఇంటిలో, వారు లేని సమయంలో దొంగలు తలుపులను పగలగొట్టి వెండి సామాగ్రి, ఇతర వస్తువులను అపహరించినట్లు ఇంటి యజమాని గుర్తించారు. అయితే దీనిపై వారు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. జీకే వీధి మండలం మారుమూల గిరిజన గ్రామాల్లో కొద్దిరోజుల క్రితం రాత్రి సమయంలో దొంగలు చోరీలకు పాల్పడగా, ఆయా గ్రామాల గిరిజనులు కర్రలు, గొడ్డలితో ప్రతిఘటించినట్లు తెలిసింది. దీంతో ఏఓబికి సమీపంలో ఉన్న సీలేరు, పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దొంగతనాలు జరక్కుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంకె మీనా**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి భావన

ప్రజాశక్తి -పాడేరు: మోడల్ కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేసారు. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారులు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణలు, ప్రభుత్వ స్థలాల్లో ప్రచార హోర్డింగులను నిర్మూలించాలన్నారు. ప్రైవేటు భవనాలపై హోర్డింగులు ఏర్పాటు చేస్తే సంబంధిత భవన యజమాని అనుమతి పొందాలన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థల దగ్గర ప్రచార బోర్డులు ఏర్పాటు చేయకూడదన్నారు. ఇవిఎంల వినియోగంపై పోలింగ్ అధికారులకు ఏప్రిల్ 12న మొదటి విడత, మే 1న రెండవ విడత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత రంపచోడవరం నుండి పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, డిఆర్ఒ పద్మావతి, నోడల్ అధికారులు డిఎల్‌పిఒ పిఎస్. కుమార్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, డిపిఆర్ఒ పి. గోవిందరాజులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మహిళలతో నిర్వాహకులు

ప్రజాశక్తి-పాడేరు: చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు మండలంలోని వంజంగి పంచాయితీ కొత్తవలన, బొర్రమామిడి గ్రామాల్లో నాబార్డు సహకారంతో స్మైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 15 రోజుల మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద నిర్వహించిన శిక్షణ మంగళవారంతో ముగిసింది. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.

ముగింపు సమావేశంలో పాల్గొన్న యూనియన్ బ్యాంకు ఎల్‌డిఎం ఎస్.రవితేజ, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ మాట్లాడుతూ తాము పొందిన శిక్షణాదరంగా మహిళలు గ్రామాల్లో అవుట్‌లెట్‌లు పెట్టేందుకు బ్యాంకుల ద్వారా అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని వెల్లడించారు. చిరుధాన్యాల వంటకాలతో మార్కెటింగ్ చేయగలిగితే మంచి ఆదాయం వస్తుందని సూచించారు. ఈసందర్భంగా సామల పులిహోరా, రాగి బిస్కెట్లు, కొర్ర పాయసం, జొన్న కుడుములు వంటి 24 రకాల వంటకాలను చిరుధాన్యాలతో తయారు చేసి ప్రదర్శన చేశారు. అలాగే పసుపు పొడితో వివిధ వంటకాలు చేశారు. కార్యక్రమంలో మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు శిక్షణ కార్యక్రమంలో అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దివ్య, సుధ, రోజ్ మేరీ మురళి, రవికుమార్ పాల్గొన్నారు.

## సిపిఎం గెలిస్తేనే ముంపు మండలాల ప్రజలకు న్యాయం

**వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య**

ప్రజాశక్తి-కూనవరం

ప్రజల కోసం నిరంతరం పోరాడే సీపీఎం రానున్న ఎన్నికల్లో గెలిస్తేనే ముంపు మండలాల ప్రజలకు న్యాయం జరుగుతుందని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అన్నారు. మండలంలోని బొజ్జరాయి గూడెంలో మంగళవారం జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వల్ల విలీన మండలాల ప్రజలు కొన్నేళ్లుగా వరదలు, ముంపుతో తీవ్ర ఇబ్బంది పడుతున్నా ఆ సమస్యలను ఏ ఒక్క ప్రభుత్వమూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 41 కాంటూరులో ఉన్న బొజ్జరాయి గూడెం గ్రామానికి ఇంత వరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీగాని, భూమికి భూమి గాని ఇవ్వలేదని, పునరావాస కాలనీలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాలకే ఇలా ఉంటే మిగతా గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ముంపు గ్రామల సమస్యలపై ఇప్పటికీ అసెంబ్లీలో నోరు మెదపని నాయకులు మనకు అవసరమా? అని ప్రశ్నించారు. గోదావరి వరదలు వచ్చినపుడు ప్రజలు ఇబ్బంది పడుతుంటే కనీసం వారి బాధలు పట్టించుకోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇప్పుడు యాత్రలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎప్పటికైనా సీపీఎం, ఎర్ర జెండాయే పేదలకు అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిని గెలిపిస్తే సమస్యలపై పోరాడే ఒక గొంతు అసెంబ్లీలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, నానుపల్లి వెంకటేశ్వరావు, మోసం రామకృష్ణ, హరీష్, నానుపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ

## తాగునీటి పథకాలను పునరుద్ధరించాలి

**- సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ**

ప్రజాశక్తి-విఆర్.పురం

వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలోని తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో తాగునీటి పథకాలను పునరుద్ధరించి వినియోగంలోకి తేవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ములకనపల్లి, కుంజావారిగూడెం, జల్లివారి గూడెం గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. అనంతరం ములకనపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, సవలం మారయ్య, కమ్మ చిచ్చు సత్తిబాబు, నాగిరెడ్డి, సుందరయ్య, తాతబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం డబ్బులు చెల్లించండి

**బాధిత రైతుల మొర**



మీడియాతో మాట్లాడుతున్న బాధిత రైతులు

ప్రజాశక్తి-విఆర్.పురం

రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి నాలుగు నెలలైనా నేటికీ డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు బాధిత రైతులు మంగళవారం మీడియా ముందు తమ గోడు వెల్లబుచ్చుకున్నారు. ధాన్యం డబ్బులు తక్షణమే ఇప్పించాలని మొరపెట్టుకున్నారు. మండలంలోని పెద్దమట్టపల్లి రైతు భరోసా కేంద్రంలో విక్రయించిన 900 టన్నులకు, రేఖపల్లి రైతు భరోసా కేంద్రంలో విక్రయించిన 535 టన్నులకు, మొత్తం 1435 టన్నుల ధాన్యానికి ఆయా గ్రామాల రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. 2023 నవంబర్ 25 నుండి రైతులు విక్రయించిన ధాన్యానికి డబ్బులు ఇవ్వలేదు. ఆ డబ్బులు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా మొద్దులగూడెం గ్రామానికి చెందిన దూది రత్తమ్మ మాట్లాడుతూ విక్రయించిన ధాన్యానికి నాలుగు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో పెట్టుబడులకు చేసిన అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా రైతులు సోడి మల్లయ్య, కుంజా కన్నయ్య, వీర్ల నాగేశ్వరరావు, సోడి సత్యం, రత్తమ్మ రాజులు తదితరులు మీడియా సమావేశంలో తమ బాధలు వినిపించారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని సిపిఎం నాయకులు అధికారులను డిమాండ్ చేశారు.



రైతు భరోసా కేంద్రంలో ధాన్యం విక్రయించిన రసీదు చూపుతున్న దూది రత్తమ్మ

## సురేంద్ర మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికుడు పాంగి సురేంద్ర అనారోగ్యంతో మంగళవారం మృతి చెందడంతో సిఐటియు తన ప్రగాఢ సంతాపం తెలిపింది. సురేంద్ర 2008లో కాంట్రాక్ట్ కార్మికునిగా విధుల్లో చేరారు. బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా కాలు చేయపని చేయక ఏడాది నుంచి అనారోగ్యానికి గురై విశాఖపట్నంలో తన కుమారుడు గోపి ఇంటి వద్ద వైద్య సేవలు పొందుతున్నారు. మంగళవారం పరిస్థితి విషమించి విశాఖలో చనిపోయారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామం సీలేరుకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో సిఐటియు బ్రాంచి అధ్యక్షులు బి.లక్ష్మణ్, కార్యదర్శి విష్ణుకుమార్, తోటి కాంట్రాక్ట్ కార్మికులు సురేంద్ర మతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని శరభవరం గ్రామ సమీపంలోని సోమవారం బైక్ అదుపుతప్పి పడిపోవడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి, మండలంలోని యశ్వనకరాయ్ గ్రామానికి చెందిన తమ్మారావు, అతని భార్య అనసూయ పొలం నుండి బైక్‌పై ఇంటికి వస్తుండగా శరభవరం గ్రామ శివారులో బైకు అదుపుతప్పి వారు కింద పడిపోయారు. దీంతో తమ్మారావుకు కుడికాలు విరిగిపోగా, అనసూయకు స్వల్ప గాయాలయ్యాయి, క్షతగాత్రులను రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించగా, వైద్య సిబ్బంది ప్రతమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు.

## టిడిపి కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:** కలిసికట్టుగా పనిచేసి టిడిపి విజయానికి కృషి చేద్దామని అరకు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి ఎస్. దొన్నుదొర అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఆ పార్టీ కార్యాలయాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, చంద్రబాబు నాయకత్వాన్ని బలోపేతం చేద్దామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టిడిపి జనసేన, బిజెపి కూటమి గెలుపు అవసరాన్ని ఓటర్లకు వివరించి చెప్పి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఎంపిటిసి గీత, మాజీ సర్పంచ్ సుబ్బారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు భాస్కరరావు పాల్గొన్నారు.

## చింతూరులో రవాణా చెక్‌పోస్ట్ మూసివేత

**ప్రజాశక్తి -పాడేరు:** రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ చెక్‌పోస్టులను మూసేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జిఒ 24 .ప్రకారం ఈనెల 15 నుంచి చింతూరులోని చట్టి చెక్‌పోస్టును కూడా మూసేసినట్లు మంగళవారం జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇతర రాష్ట్ర వాహనదారులు పన్నులు, పర్మిట్‌లు, ఇతర సేవలను ఆన్‌లైన్ ద్వారా తీసుకోవాలని సూచించారు.

## ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి-నక్కపల్లి :** ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలకు మంగళవారం ఉదయం శ్రీకారం చుట్టారు. స్వామి కల్యాణానికి అహ్వానం పలుకుతూ పురవీధుల్లో పెండ్లి కావడి ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యుల, అర్చకులు కష్ణమాచార్యులు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెళ్లికావిడి ఊరేగింపులో భక్తులు అనవాయితీ ప్రకారం పసుపు, కుంకం, కొబ్బరి బొండాలు సమర్పించారు. సాయంత్ర వార్షిక కల్యాణం ప్రారంభ సూచికంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నేడు వెంకన్న కల్యాణం**

ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద బుధవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి ఎదురునన్నాహ ఉత్సవం, రథోత్సవం జరుగుతుంది. అనంతరం అర్ధరాత్రి ఆలయం వద్ద కల్యాణ.వేదికలోఉభయ దేవరులతో స్వామి కల్యాణోత్సవం జరుగుతుంది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు కల్యాణం తిలకించేందుకు రానున్న నేపథ్యంలో టిటిడి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.స్వామి విలువైన బంగారు ఆభరణాలను ట్రెజరీ నుండి మంగళవారం పోలీస్ బందోబస్తు నడుమ ఆలయానికి తీసుకువచ్చారు.శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామికి అలంకరించారు.

**పటిష్ట బందోబస్తు ఏర్పాటు**

వెంకన్న కల్యాణోత్సవాలు సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసారు. డిఎస్‌పి జెఆర్‌ఆర్ మోహన్, ఆరుగురు సిఐలు, 20మంది ఎస్ఐల పర్యవేక్షణలో 150మంది పోలీసులు బందోబస్తు కల్పించారు. స్వామి తిరువీధి సేవలు, రథోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఉపమాకలో వాహనాల పార్కింగ్‌పై పోలీసులు ఆంక్షలు విధించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిఐ విజయ్ కుమార్ సూచించారు.

**వెంకన్నకు ఇత్తడి గజ వాహనం బహూకరణ**

ఉపమాక వెంకన్నకు కాకినాడ జిల్లా, మండపేటకు చెందిన జె.వెంకటేశ్వరరావు దంపతులు రూ.రెండు లక్షలతో తయారు చేయించిన ఇత్తడి గజ వాహనాన్ని కల్యాణోత్సవాల సందర్భంగా బహూకరించారు. దీనిని ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ చిలువూరి రామ సూర్యనారాయణ రాజు( పెంకుల రాజు), భక్తులు పాల్గొన్నారు.

## టిడిపిలో 30 కుటుంబాలు చేరిక

**ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ :** నర్సీపట్నం నియోజకవర్గంలోని చెట్టుపల్లి సర్పంచ్ గజాల నూకరత్నం, మాజీ ఎంపిటిసి గజాల సూరిబాబుతో పాటు పలువురు వార్డు మెంబర్లు కరణం రాంబాబు, బంటు రమణ, కంట్రెడ్డి లక్ష్మి, వెలంకాయల నూకరత్నం, చెల్లురి అప్పారావు, సీనియర్ కార్యకర్తలు వల్లూరు నాగేశ్వరరావు, గల్లా సూరిబాబు, బంటు సత్తిబాబు, సేనాపతి అప్పారావుతో మొత్తం 30 కుటుంబాలు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం అయ్యన్న మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి చింతకాయల విజయ్, జెడ్‌పిటిసి సుకల రమణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

# అసంపూర్తి రోడ్డుపై గిరిజనం ఆందోళన

**పనులు చేయకుండానే నిధులు స్వాహా చేశారని ఆరోపణ**

**విజిలెన్స్ దర్యాప్తు, చర్యలకు మన్యవాసుల డిమాండ్**



అసంపూర్తి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న తోంకోట గిరిజనులు

**ప్రజాశక్తి - అనంతగిరి :** అసంపూర్తిగా ఆగిపోయిన రోడ్డు నిర్మాణపనులను తక్షణమే పున్ణప్రారంభించి పూర్తిచేయాలని కోరుతూ కొండశిఖర తోంకోట రిజనులు నిరసన చేపట్టారు. పనులు చేయకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై రికార్డులు సృష్టించి నిధులు స్వాహ చేశారని ఆరోపించారు. ఈ మేరకు అధ్వానరోడ్డుపై బైఠాయించి అధికారుల నిర్లక్ష్యం, మొండివైఖరిపై నినాదాలు చేస్తూ వినూత్నరీతిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పురుగు వెంకటరావు, కింకరి ఈశ్వరరావు తదితరులు మాట్లాడుతూ, మండలంలో మారుమూలన కొండశిఖరుపై ఉన్న తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక పడుతున్న అవస్థలపై అధికారులు, నేతల దృష్టికి తీసుకెళ్లగా 2021-22లో రూ.85 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హుకుంపేట మండలం దరెగెడ్డ నుంచి తోంకోట వరకు మూడు కిలోమీటర్ల మెటల్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే పనులను ప్రారంభించిన సంబంధిత అధికారులు పూర్తి చేయకుండానే అర్ధాంతరంగా వదిలేశారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు, నేతల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేదని వాపోతున్నారు.

అధికారులను ప్రశ్నిస్తే రోడ్డు పనులు ఎప్పుడో పూర్తిచేసేశామని అంటున్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే కనీసస్థాయిలో పనులు జరగలేదని, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై రికార్డులు సృష్టించి, బిల్లులు డ్రాచేసి కైంకర్యం చేశారని అనుమానం కలుగుతోందన్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయకుండానే అయిపోయిందంటున్న అధికారుల నిర్వాకంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# వైసిపి అభ్యర్థి విస్తృత ప్రచారం

**ప్రజాశక్తి -పాడేరు :** మండలంలోని ఇరాడపల్లి పంచాయతీ బొడ్డపుట్టు, సరియపల్లి, ఇ.కొత్తఊరు, గబ్బంగి పంచాయితీ పనసపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు పాడేరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి .మత్స్యరాస విశ్వేశ్వరరాజు మంగళవారం గ్రామాల్లో పర్యటించారు. ఆయనకు ఆయా గ్రామాల మహిళలు హారతులతో ఘనంగా స్వాగతించారు. గడపగడపకు వెళ్లి ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, వైస్ ఎంపిపి కుంతూరు కనకాలమ్మ, స్థానిక సర్పంచ్ గల్లెలి అస్విజ, ఎంపిపి మదిలి సుబ్బమ్మ, ఎఎంసి చైర్మన్ కూతంగి సూరిబాబు, డిఎవిబి చైర్మన్ లకే సత్యవతి, జిల్లా పంచాయితీ రాజ్ విభాగ అధ్యక్షులు గబ్బాడ చిట్టిబాబు, కూడ సురేష్ కుమార్, కిల్లు కోటి బాబు, కిముడు విశ్వ, సల్ల చిట్టమ్మ, కుంతూరు నరసింహమూర్తి, వంతల రాంబాబు, వంతల నరేష్, కోడా



విశ్వేశ్వరరాజును స్వాగతిస్తున్న గిరి మహిళలు

సుశీల, జీలుగుబోయిన ఈశ్వరరావు, పాంగి సత్తి బాబు, లకే రత్నభాయి, బోధ నారాయణ, గల్లెలి లింగమూర్తి, మదిలి సత్యనారాయణ, మదిలి త్రినాథ్, తమర్భ వెంకటేశ్వర్లు, తమర్భ బాబుల్ నాయుడు, గంగాపు జరి, డాక్టర్ చంటిబాబు నాయుడు,కటారి చందు పాల్గొన్నారు.

# సమన్వయంతో ముందుకు సాగుదాం

**పరిచయ కార్యక్రమంలో మాడుగుల టిడిపి అభ్యర్థి పైలా**

**ప్రజాశక్తి- చీడికాడ :** వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకు సాగుదామనిమాడుగుల అసెంబ్లీ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు పిలుపునిచ్చారు. మంగళవారం చీడికాడ జనసేన కార్యాలయంలో జనసేన నేతలు, కార్యకర్తలతో టిడిపి అభ్యర్థి పైలా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పైలా మాట్లాడుతూ, మాడుగులో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఓటమి లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇప్పటికే టిడిపి నేతలు పివిజి కుమార్, గవిరెడ్డి రామానాయుడులను కలిశానన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు, బాబూష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ, మండల అధ్యక్షులు జివి.మూర్తి. వైస్ ప్రెసిడెంట్ దిబ్బిడి సన్యాసినాయుడు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసి నాయుడు, పేరపు కొండబాబు, రెడ్డి రాము, దొగ్గ బలరాం, కామిరెడ్డి ఎరుకు నాయుడు, పేరపు అప్పారావు, పాతాళం ఎర్రునాయుడు, నడుపూరు ముత్యాలు దుర్గ పాల్గొన్నారు

## చోరీలపై అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ :** విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రావికమతంఎస్ఐ ధనంజయరావు సూచించారు. విజయనగరానికి సమీపంలో ఎపిఎస్‌పి ఐదవ బెటాలియన్ చేరువలో హైవేలో నలుగురు సభ్యుల చెడ్డీగ్యాంగ్ బృందం ఇంటితలుపుకు కన్నవేసి, లోపలకు చొరబడి చోరీకి పాల్పడమే కాకుండా, అడ్డొచ్చిన యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల సంచారంపై నిఘాపెట్టి, అనుమానం వస్తే పోలీసులకు సమాచార ఇవ్వాలని కోరారు పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తుల సంచారంపై డయల్ 100కుగానీ, పోలీస్‌స్టేషన్‌కు గానీ ఫిర్యాదు చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## పాము కాటుతో బాలునికి అస్వస్థత

**ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ :** రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన గొర్లె హర్ష అనే పన్నెండేళ్ల బాలుడు సోమవారం పాము కాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గొర్లే నానాజీ (వందల నాయుడు) కుమారుడైన హర్ష వ్యవసాయ పాకల వద్ద ఆడుకుంటుండగా, పాము కాటుకు గురయ్యారు. హుటాహుటిన రావికమతం పిహెచ్‌సికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

## 'జ్ఞాపకాల దొంతర' కవితకు ప్రథమ బహుమతి

**ప్రజాశక్తి -పాయకరావుపేట :** అంతర్జాతీయ అంతర్జాలంలో 'నిదురపోను నేస్తమా' అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో తునికి చెందిన భావకవి పంచదార్ల మాణిక్యాలరావు 'జ్ఞాపకాల దొంతర' కవితకు ప్రథమ బహుమతి వరించింది. ఈ నెల 17న నిర్వహించిన ఆన్‌లైన్‌లో వర్చువల్‌గా నిర్వహించిన అంతర్జాల కవి సమ్మేళనంలో ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి నుంచి 500 మంది కవులు పోటీలో పాల్గొనగా, మాణిక్యాలరావు ప్రథమ బహుమతి సాధించారు. తెలుగు వెలుగు సాహిత్యవేదిక, ఎపి అధ్యక్షులు మీసాల చిన గౌరినాయుడు అధ్యక్షతన జరిగిన కవితా సమ్మేళనంలో కిలపర్తి దాలినాయుడు, మోటూరి నారాయణ రావు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ చొప్పదండి రాధ, డాక్టర్ నవనీత రవీందర్, డాక్టర్ .బేతా శారదాదేవి, డాక్టర్ బాలచంద్ర సాదే, డాక్టర్ పిఆర్‌ఎస్‌ఎన్ .మూర్తి న్యాయ సమీక్షకులుగా వ్యవహరించి, కవితా ప్రతిభలో టాప్ 25 కవులను ప్రకటించగా, వారిలో మాణిక్యాలరావుకు ప్రథమస్థానం దక్కడంపై కవి,ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ యాజ్ఞవల్క్య శర్మ హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

## చీడిగుమ్మల ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ :** గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో జరిగిన ఘటనపై బాధితుల తరపున టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మంగళవారం ఎస్ఐ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భగా విజయ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ, వైసిపి నేతలతో కలిసి వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో అత్యుత్సాహం చూపడం వల్ల వారు తీవ్రంగా నష్టపోతారన్నారు. వాలంటీరు ఉద్యోగం కోల్పోవడమే కాకుండా, ముమ్మందు ఎటువంటి ప్రభుత్వం, ప్రయివేటు ఉద్యోగాలకు అర్హులు కాకుండా పోతారన్నారు ఇప్పటికైనా అత్యుత్సాహం మానుకోవాలని, ఎన్నికల నిబంధనలను ఎంతటివారైనా పాటించాల్సిందేనని విజయ్ అన్నారు. టిడిపి మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

## 'వైసిపి నేతల అక్రమాలపై చర్యలు తీసుకోండి'

**ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ :** గొలుగొండ మండలం ఏఎల్ పురంలో వైసిపి నేతలు, ప్రజాప్రతినిధుల అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఏఎల్ పురం ఎంపిటిసి రుత్తల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ తనకు భూములు లేవని, కౌలు రైతును కూడా కాకపోయినా తనపేరున రైతు భరోసా రూ.13,500 వచ్చినట్లు ప్రభుత్వం లెక్కలో చూపించి, వాలంటీరు ఇచ్చిన బ్రోచర్లలో ఉండడం దారుణమన్నారు. ఇలాగే ఎందరో బినామీ రైతుల పేరిట రైతుభరోసా, ఇతర పథకాలను తీసుకుని లక్షల్లో ప్రభుత్వానికి మోసపుచ్చారని ఆరోపించారు. గ్రామంలో వలంటీర్లకు, పెళ్ళికాని యువకులకు, సొంతిళ్లు ఉన్నవారికి, గతంలో ఇళ్లు మంజూరైన వారికి ఇపుడు జగనన్న ఇళ్లస్థలాలు, హౌసింగ్ పథకాలను అడ్డగోలుగా అందజేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వికలాంగుడినైన తనకు ఇంటిస్థలం ఇవ్వాలని కోరగా, సర్వే చేశారని, చివరకు తాను పార్టీ మారాననే అక్కసుతో స్థలంగానీ, పట్టాగానీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వపథకాల అమలులో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేసి చర్యలు చేపట్టాలని కోరారు.



నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు

## యుజిడి సమస్యపై నిరసన

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని కృష్ణా గార్డెన్స్ రామాలయం వెనుక వీధిలో కొంతకాలంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీక్ అవుతూ దుర్గంధపూరిత వాతావరణం నెలకొందని, తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆ ప్రాంతంలో డివైఎఫ్ఐ జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సమస్యను అధికారులుగానీ, వార్డు కార్పొరేటర్‌గానీ పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జగదాంబ జోన్ అధ్యక్షులు కె.గణేష్, ఉపాధ్యక్షులు కె.గౌతం, వి.అమ్మాజీ, అరుణ, అచ్చిబాబు, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజుకు ఉబర్ డ్రైవర్ల సమ్మె

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** సమస్యలపై ఉబర్ డ్రైవర్లు చేపట్టిన సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఎయిర్‌పోర్ట్, జగదాంబ, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన రేట్లు తగ్గించకూడదని, చట్ట ప్రకారం కంటే అదనంగా కమిషన్ తీసుకోవడం అపాలని అన్నారు. ఉబర్‌లో ఫ్లాట్ ఫామ్ ఫీస్ 39 తీసివేయాలన్నారు. తగ్గించిన రేట్లు పెంచాలన్నారు. నెగిటివ్ బ్యాలెన్స్ రూ.వెయ్యికి మించి ఉండాలన్నారు. నైట్ ఫెయిర్స్ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు 50 శాతం ఇవ్వాలన్నారు. సమ్మెకు విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసులు, కె.పోలినాయుడు, ఆనంద్, అబ్బాయి, మనోహర్ రామ్మోహనం, సిమ్మ శ్రీను, నాయుడు నాయకత్వం వహించారు.

## ఎంవివిని కలిసిన పలువురు నేతలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** సోమవారం వైసిపిలో చేరిన టిడిపి సీనియర్ నేత గంపల వెంకట రామచంద్రరావు, ఆయన సతీమణి సంధ్యారాణి, గతంలో ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావులు మంగళవారం లాసన్స్‌బే కాలనీలోని విశాఖ ఎంపీ, వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ జగన్ సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలో పలువురు చేరుతున్నట్టు తెలిపారు. కార్యక్రములో గోపాలపురం పరిశీలకులు గన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 21న శోభన్‌బాబు చిత్ర గీతాలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఈ నెల 21న నట భూషణ్ శోభన్ బాబు 16వ వర్థంతి సందర్భంగా శోభన్ బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను మంగళవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోగల సంస్థ కార్యాలయంలో సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ద్వారకా నగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగే సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఇందిరా సాహిణి తదితరులు పాల్గొన్నారు.

# అసంతృప్తుల 'కూటమి'

**కూడికలు, తీసివేతల్లో టిడిపి, జనసేన తర్జనభర్జనలు**

**దక్షిణం సీటుపై పునరాలోచన తప్పదా ?**

**భీమిలిపై కొనసాగుతున్న మీమాంశ**

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

విశాఖ జిల్లా అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల పంచాయతీ కూటమికి పలు స్థానాల్లో తలబొప్పి కట్టిస్తోంది. టికెట్ల కేటాయింపుల్లో అసంతృప్తులు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా విశాఖ పార్లమెంట్ స్థానంపై బిజెపి, జనసేన, టిడిపి కూటమి ఒక అవగాహనకు రాలేని పరిస్థితులు కొనసాగుతున్నాయి. గీతం విద్యాసంస్థల అధినేత భరత్‌కే సీటు ఖరారైనట్లు మంగళవారం నాటికి తెలియడంతో నగరంలో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహ వాతావరణం కనిపించింది. ఇదిలా ఉండగా ఎంపీ టికెట్‌ను బిజెపి ఆశించిన విషయం తెలిసిందే. అయితే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం అమ్మేయాలని మోడీ నిర్ణయించడం, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేయడం, రైల్వేజోన్ ఉత్తిమాటగానే నిలవడం వంటి కారణాలతో ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి ఎవరు నిల్చున్నా డిపాజిట్లు కూడా దక్కవంటూ టిడిపి శ్రేణులు బాహాటంగానే పేర్కొన్నాయి. పైగా భరత్ ఎంపీగా పోటీచేసి గతంలో తక్కువ ఓట్లతో ఓటమి చెందారు. సదరు వ్యక్తికే టికెట్ ఇవ్వాలన్న పట్టు టిడిపి, జనసేన శ్రేణుల నుంచి ఏకోన్ముఖంగా వినిపించింది. ఈ క్రమంలోనే భరత్‌కు ఎంపీ టికెట్ కేటాయించినట్టు తెలుస్తోంది.

**అసెంబ్లీ సీట్లపై వాస్తవిక దృష్టి లోపించిందా ?**

కూటమి నేతలు కొన్ని టికెట్ల కేటాయింపులో వాస్తవికతను మరిచారన్న చర్చ టిడిపి, జనసేన కిందిస్థాయిలో నెలకొంది. అందులో ప్రధానమైనది నగరంలోని దక్షిణం అసెంబ్లీ సెగ్మెంట్. ఇక్కడ వైసిపికి సిట్టింగ్ అభ్యర్థి వాసుపల్లి గణేష్ ఉన్నారు. ఆయన్ని ఢీ కొట్టగలిగే నేతను, స్థానికంగా ఇక్కడ ఉండే వారిని ఎంపిక చేయడంలో రెండు పార్టీల అధిష్టానాలూ చతికిలపడ్డాయన్నది వినిపిస్తోంది. పొత్తులో ఈ సీటు జనసేనకు దక్కింది. అయితే ఇక్కడ ఏ మాత్రమూ ఓటింగ్ లేని వంశీకృష్ణకు ఇవ్వడంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



వంశీకృష్ణ పోస్టర్లును తగులబెడుతున్న జనసేన కార్యకర్తలు

స్థానికతను విస్మరించారంటూ జనసేనకు చెందిన మూగి శ్రీనివాసరావు బాహాటంగానే ఎద్దేవా చేస్తుండడం తెలిసిందే. అభ్యర్థిని మార్చాలంటూ పట్టుబడుతున్నారు. ఇక్కడ వాసుపల్లికి ధీటుగా ఎదిగిన వ్యక్తులను దృష్టిలో పెట్టుకోవాలని టిడిపి, జనసేన పార్టీలకు ఇప్పటికే లేఖలు వెళ్లాయి. కొంతమంది టిడిపి కార్పొరేటర్లు సైతం వంశీ అభ్యర్థిత్వం పట్ల తీవ్ర అభ్యంతరంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కూటమి అధిష్టానాలు ఈ అంశంపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది.

భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ విషయంలోనూ టిడిపి, జనసేన తేల్చుకోలేని స్థితి కొనసాగుతోంది. గడచిన కొన్ని నెలలుగా ఇక్కడ వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి ముత్తంశెట్టి తనదైన శైలిలో ప్రచారం సాగిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఆయన్ని ఢీకొట్టాలంటే కూటమికి సరైన అభ్యర్థి అవసరం. అనివార్య స్థితిలో విశాఖ ఎంపీ సీటును భరత్‌కు కాకుండా బిజెపికి ఇవ్వాల్సి వస్తే భీమిలికి భరత్‌ను పంపాలని లేదా తప్పనిసరైతే మాజీ మంత్రి గంటాను ఇక్కడి నుంచి అసెంబ్లీ బరిలోకి దించాలన్న ఆలోచనలో టిడిపి ఉన్నట్టు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. మరో రెండు రోజుల్లో అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వంశీకి టికెట్ ఇవ్వొద్దంటూ జనసేన కార్యకర్తల నిరసన

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** దక్షిణ నియోజకవర్గం టికెట్‌ను జనసేనకు కేటాయించినప్పటికీ, పార్టీ తరపున పోటీ చేయనున్న మాజీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ విజయానికి తాము పనిచేసేది లేదని పలువురు జనసేన కార్యకర్తలు, మహిళలు రోడ్డెక్కారు. మంగళవారం పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డు వాటర్ ట్యాంక్ వద్ద 'వంశీకృష్ణ వద్దు-జనసేన ముద్దు'అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎన్నికల కోసం రూపొందించిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఫొటోతో ఉన్న పోస్టర్లు, ఫొటోలను దగ్ధం చేశారు. నల్ల బెలూన్లు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు సూరాడ తాతారావు, బంగారు రాజు మాట్లాడుతూ వంశీకృష్ణ శ్రీనివాస్ దక్షిణ నియోజకవర్గంలో సంబంధం లేని వ్యక్తిని, ఆయన తూర్పు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి 50 వేలకుపైగా తేడాతో ఓటమి చెందారని, సొంత నియోజకవర్గంలో విజయం సాధించని వంశీకృష్ణ దక్షిణంలో ఎలా విజయం సాధిస్తారని ప్రశ్నించారు. ఆయనకు టికెట్ ఇస్తే జనసేన ఇక్కడ గెలవదని స్పష్టం చేశారు. స్థానిక జనసేన నాయకులు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, మూగి శ్రీనివాసరావులలో ఒకరికి టికెట్ ఇవ్వాలి లేదా దక్షిణలో పనిచేస్తున్న జనసేన నాయకులకు టికెట్ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగన్నాథరావు, తాతాజీ, ఎమ్‌డి అబీదా పాల్గొన్నారు.

# టిడిపి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొలమరశెట్టి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** నగరానికి చెందిన పొలమరశెట్టి శ్రీనివాసరావు టిడిపి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెనాయుడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకూ ఈ పదవిలో ఉన్న పాశర్ల ప్రసాద్ పశ్చిమ నియోజకవర్గంలో గణబాబుకు పార్టీ టికెట్ ఇవ్వకూడదని పోరాటం చేశారు. అయితే పార్టీ టికెట్టు గణబాబుకే దక్కింది. ఈ నేపథ్యంలో టిడిపి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి పాశర్ల ప్రసాద్ రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే.



ఖాతాదారుల సమావేశంలో పాల్గొన్న రాంబాబు తదితరులు

## ఖాతాదారులకు మెరుగైన సేవలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఖాతాదారుల మనోభావాలకు అనుగుణంగా, వినూత్నమైన సేవలందించేందుకే కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు స్థాపించబడిందని చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. ఖాతాదారుల ఆదరణతో రానున్న కాలంలో బ్యాంకును మరింత అభివృద్ధి దిశగా తీసుకువెళ్తామన్నారు. అన్ని రంగాల ఖాతాదారులకు తమదైన సరళిలో, సాంకేతికంగా సేవలందించడమే తమ బ్యాంకు ముఖ్య లక్ష్యమన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా గాజువాక శాఖలో మంగళవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో రాంబాబు మాట్లాడారు. బ్యాంకు స్థాపించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగిడిన తరుణంలో ఇప్పటికి వివిధ జిల్లాలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనంతో కేవలం ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17,350 మంది సభ్యులతో రూ.33 కోట్లు వాటా ధనం పొంది, రూ.1400 కోట్ల వ్యాపారంతో అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గాజువాకలో తమ బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి ఖాతాదారులు, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతోందన్నారు. రూ.30 కోట్ల డిపాజిట్లు, రూ.13 కోట్ల రుణాలతో ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే కాకుండా వారి ఆదరాభిమానాలు పొందుతోందన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులు మాట్లాడుతూ పలు సూచనలు చేయడంతో పాటు వారి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఖాతాదారులను బ్యాంకు చైర్మన్ శాలువాతో సత్కరించారు. మెమోంటోలను అందజేశారు. సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్ కిషోర్, ఒఎస్‌ఒ శాస్త్రి, గాజువాక శాఖ మేనేజరు కె.సింహాచలం పాల్గొన్నారు.

## రూ.500 కోట్ల క్రైస్తవ భూమి ఆక్రమణ

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు ఎంవివి.సత్యనారాయణను జైలుకి పంపిస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కెఎ.పాల్ అన్నారు. రైల్వే న్యూ కాలనీలోగల పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎంవివి రూ.500 కోట్ల విలువైన క్రైస్తవ భూమి ఆక్రమించారన్నారు. ఆయన మీద కేసులు వేసి జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. చంద్రబాబుపై పాల్ విమర్శలు చేశారు. సినీ నటుడు బాబూమోహన్ తమ పార్టీ తరపున వరంగల్ నుంచి పోటీ చేస్తారన్నారు. తాను ఎస్.కోట, పిఠాపురం నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని పార్టీలో పలువురు కోరుతున్నారన్నారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ కల్యాణ్ అని ఎద్దేవా చేశారు. 33 అంశాలతో త్వరలో ప్రజాశాంతి పార్టీ మ్యానిఫెస్టో విడుదల కానుందన్నారు. మీడియా సమావేశంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రవి కుమార్ పాల్గొన్నారు.

## 1083వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా టిడిపి, జనసేన కూటమి బాధ్యత తీసుకోవాలని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్క లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం నాటికి 1083వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పిలి రామకృష్ణ. జిల్లా ఉపాధ్యక్షులు ముప్పాళ్ళ శ్రీకృష్ణ. జిల్లా కార్యదర్శి సాత్రబోయిన చిన్నప్పారావు, పోక్కల కృష్ణ. పెద్దాడ పైడిరాజు, కంబాల సత్యనారాయణ, పిండి కృష్ణ, మధు, సురేష్ పాల్గొన్నారు.